




TS-20-0147370

# మన మాట

TELANAGANA సంపుటి 7 సంచిక 206

ప్రతి పదం ప్రజల పక్షం








శుక్రవారం | 9 జనవరి | 2026 | పేజీలు : 12

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA








# నాయకుడు కాదు సేవకుడు!

- డ్రైనేజీ నుంచి స్మశాన వాటిక వరకూ
- ప్రజలకేం కావాలో ప్రతీదీ తనకు తెలుసు...
- ప్రతి సమస్య చూశాడు ప్రతి బాధ విన్నాడు
- 20 ఏళ్ల సేవలో ఇప్పుడు మార్పే లక్ష్యం
- సాయిబాబా నగర్ సమస్యలపై సమరశంఖం
- 292వ వార్డు అభివృద్ధే తన అజెండా!
- కార్పొరేట్ అభ్యర్థి వారాల వినోద్ అంతరంగం

హైదరాబాద్ జీహెచ్ఎంసీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, వార్డు 292 - సాయిబాబా నగర్ నుంచి కార్పొరేటర్గా పోటీ చేయబోతున్న వారాల వినోద్, గత రెండు దశాబ్దాలుగా ప్రజల మధ్యనే ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజల మధ్యే ఉంటూ ఎవరికి ఏ అవసరం వచ్చినా ముందుండి పరిష్కారం చూపించే నాయకుడిగా గుర్తింపు పొందారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నేతలకు భిన్నంగా వారాల వినోద్ దాదాపు గడిచిన 20 సంవత్సరాలుగా కాలనీలు, బస్తీల్లోని సమస్యలను దగ్గరగా చూసి, వీలైనంత వరకు పరిష్కారానికి ప్రయత్నిస్తూ... ప్రజలతోనే కలిసి నడుస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో, వార్డు పరిధిలో ఉన్న ప్రధాన సమస్యలను సమస్యల వారీగా ఆయన తన అజెండాగా మార్చుకొని.. వాటి పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇస్తున్నారు.





## 30 ఏళ్ల నాటి డ్రైనేజీ వ్యవస్థను మార్చేస్తా

సాయిబాబా నగర్ పరిధిలోని కొన్ని కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, 1990వ దశకంలో మూడున్నర దశాబ్దాల క్రితం కాలనీ ఏర్పడిన సమయంలో వేసిన డ్రైనేజీ పైపులైన్ ఇప్పటికీ మార్చలేదని, అలాగే ఉండిపోయిందని జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేయబోతున్న వారాల వినోద్ తెలిపారు. దీని వల్ల డ్రైనేజీ తరచూ ఓవర్ ఫ్లో అయి, బ్లాకేజీలు, లీకేజీలు ఏర్పడుతూ ఇళ్ల ముందు మురుగు నీరు నిలుస్తోందని చెప్పారు. రామ్ లీలా మైదానం పరిసర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్యపై గతంలో అనేకసార్లు అధికారులకు వినతులు ఇచ్చామని, ప్రజలతో కలిసి నిరసనలు కూడా చేసినట్లు ఆయన తెలిపారు.

## మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయించి ట్రాఫిక్ సమస్య తీరుస్తా



వార్డు పరిధిలో సరైన మార్కెట్ యార్డ్ లేకపోవడం వల్ల కూరగాయల వ్యాపారులు రోడ్లపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో రోడ్డుమీద ట్రాఫిక్ జామ్ అవుతోందని, స్కూల్ పిల్లలు, ఆఫీస్ కు వెళ్లే, తిరిగి వచ్చే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినోద్ తెలిపారు. స్థానిక ప్రజల కోరిక మేరకు, ప్రస్తుతం రోడ్లపై కొనసాగుతున్న మార్కెట్ను సమీపంలో ఎక్కడైనా విశాలమైన స్థలానికి మార్చాలని నిర్ణయించుకున్నామని, దీనిపై కాలనీ ప్రజలు కూడా చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారని వారాల వినోద్ చెప్పారు.





# స్మశాన వాటిక లేదన్న బాధలకు ఫుల్ స్టాప్ పెట్టిస్తా

సాయిబాబా నగర్ వార్డు పరిధిలో స్మశాన వాటిక లేకపోవడం ప్రజలకు పెద్ద సమస్యగా మారింది. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేయడానికి కనీస సదుపాయాలు కూడా సమీప ప్రాంతాల్లో అందుబాటులో లేవని ఆయన తెలిపారు. రూములు లేకపోవడంతో పాటు.. కనీసం బోర్ కూడా లేకపోవడం, దహన సంస్కారాలకు అవసరమైన



మౌలిక వసతులు లేకపోవడం వల్ల ప్రజలు రోడమేస్త్రి నగర్ స్మశాన వాటికను ఆశ్రయించాల్సిన ఆగత్యం ఏర్పడుతోందని చెప్పారు. అందులోనూ అది చాలా దూరం కావడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. పాండు బస్తి, వడ్డెర బస్తి దయానంద నగర్, ముత్యాల బస్తి, నరసింహ బస్తి వంటి ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉందని, వీటన్నింటికీ తాను కార్పొరేటర్ గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఫుల్ స్టాప్ పెట్టిస్తానని హామీ ఇచ్చారు.

## రోడ్లు, గల్లీల దుస్థితికి సొల్యూషన్ ఇస్తా





సుందర్ నగర్తో పాటు పలు ప్రాంతాల్లో మంజీరా పైప్ లైన్ పనులు ఇప్పటికీ పూర్తికాలేదని వారాల వినోద్ తెలిపారు. కొన్ని ఏరియాల్లో డ్రైనేజీ వ్యవస్థే లేకపోవడం, గల్లీల్లో రోడ్లు సరిగా లేకపోవడం వల్ల వృద్ధులు, పిల్లలు నడవలేని పరిస్థితి ఉందన్నారు. ముత్యాల బస్తిలో అయితే, రోడ్ల మధ్యలోనే పెద్ద పెద్ద రాళ్లు ఉండటంతో వాహనాలు వెళ్లలేకపోతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో ఇళ్లకు వెళ్లాలంటే స్థానికులు తమ వాహనాలను చాలా దూరంగా పెట్టాల్సి వస్తోందని చెప్పారు. ఈసమస్యకు పరిష్కారం చూపిస్తానని నమ్మకంగా చెబుతున్నారు వారాల వినోద్.





# రసాయన పరిశ్రమల కాలుష్యాన్ని దూరంగా తరిమికొడతా





సాయిబాబా నగర్ సహా సమీపంలోని చుట్టుపక్కల అన్ని కాలనీలు, బస్తీల్లో కూడా సాయంత్రం అయ్యిందంటే కాలుష్యం చుట్టుముడుతోందని, దీని కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారాల వినోద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న కెమికల్ కంపెనీలను ఇక్కడి నుంచి దూరంగా తరలించాలని గత ప్రభుత్వ కాలం నుంచే డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో తాము పోరాటాలు కూడా చేశామని, దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా పరిశ్రమలను ఇక్కడి నుంచి దూరంగా తరలించేందుకు ప్రయత్నిస్తామని చెప్పిందని గుర్తుచేశారు. ఈ అంశంపై మాజీ మంత్రి కేటీఆర్ కూడా చొరవ తీసుకున్నారని వారాల వినోద్ గుర్తుచేశారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ అంశంపై దృష్టి పెట్టి, రసాయన పరిశ్రమలను ఇక్కడి నుంచి నగరానికి దూరంగా తరలించాలని ప్రజల తరపున కోరుతున్నామని చెప్పారు. తాను కార్పొరేటర్ అయిన వెంటనే ఈ అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారు.



## రెండు దశాబ్దాల సేవా కార్యక్రమాలు

వారాల వినోద్ గత రెండుడు దశాబ్దాలుగా రాజకీయాలకు అతీతంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరగా ఉన్నారని స్థానికులు చెబుతున్నారు.పేద కుటుంబాలకు సహాయం, అనారోగ్యంతో బాధపడేవారికి అండగా ఉండటం, సమస్యలు ఎదురైనప్పుడు అధికారుల వద్దకు తీసుకెళ్లి వాటిని పరిష్కారం అయ్యేలా చూడటం వంటి కార్యక్రమాలను ఆయన నిరంతరం చేస్తూనే ఉన్నారని వార్డు ప్రజలు పేర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాదు, ఎప్పుడూ ప్రజల మధ్య ఉండే నాయకుడిగా ఆయనకు ఈ ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు ఉందని వారు అంటున్నారు.



## ఎమ్మెల్యే హామీ - సమస్యల పరిష్కారానికి భరోసా

పై సమస్యలన్నింటిమీదా తనకు పూర్తి అవగాహన ఉందని, వీటిని పరిష్కరించేందుకు గానూ... అన్ని సమస్యలను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లానని వారాల వినోద్ చెప్పారు. దీంతో, ఎమ్మెల్యే కూడా ఈ సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆయన



తెలిపారు. ఎమ్మెల్యే అండతో, ప్రజల సహకారంతో, అధికారుల సమన్వయంతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తామని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

## ప్రజల సమస్యలే తన రాజకీయ అజెండా

292వ వార్డు సాయిబాబా నగర్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని వారాల వినోద్ స్పష్టం చేశారు.రెండు దశాబ్దాల తన సేవా అనుభవంతో, ప్రజలకు నిజంగా ఉపయోగపడే అభివృద్ధి చేయాలనే సంకల్పంతో వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని తెలిపారు.

అనిల్ కుమార్ కుంట....
సందేశ్ మీడియా...
93933 44405